


# భారత ఎద్దు

## అనుభవాల కలంనుంచీ అనేక విషయాలు



మనం ఎన్నిరకాల ప్రాంతీయాభిమానాన్ని ఎన్ని విషయాల్లో చూపించినా తెల్లవాడి ప్రభావం ఇప్పటికీ వదులుకోలేదన్నది నిర్వివాదాంశం.

వదులుకునే ఉంటే తమిళభాష మాట్లాడేవాళ్ళు చక్కటి సమ్మర్ క్రాఫ్‌తో కనిపించరు. అలాగే తెలుగు భాష మీద అభిమానం చూపించే ఏ ఒక్కరూ ఇవాళ పంచె, కండువాతోనో వేష్టితోనో కనిపించేవారు. మార్పు అన్నది సహజం, అవసరం. అంతవరకూ అయితే ఆహ్వానించదగ్గదే అభినందనీయమే.

తెల్లవాడు మనదేశంలో ఏం సాధించినా, సాధించకపోయినా (నిజానికి తెల్లవాడు సాధించినదయినా మనం సాధించలేకపోతున్నాం.) క్లైవు దొరగారు చెయ్యగలిగిన జాతీయ రహదారిని సుగమం చేసే వాజ్‌పేయీ ప్రభుత్వం ప్రయత్నాన్ని, ఆ ప్రభుత్వం గద్దె దిగిన మరుక్షణమే అటకెక్కించేశాం. మద్రాసు నుంచీ దిండీవనం వచ్చే సగం మార్గమే నాలుగు రోడ్ల రహదారి (దీన్ని వాజ్‌పేయి రోడ్డు అంటారు డ్రైవర్లు) మిగతా రోడ్లు ఆయా నాయకుల 'ఫలహారాల' రోడ్లు.

చేసే ప్రతి పనిలోనూ 'చిత్తశుద్ధి' లోపమే మన దేశం ఇంకా ఇలా ఉండటానికి కారణం. ఈ దేశాన్ని పాలించడానికి వచ్చిన దొరలు - మన దేశంలో మన భాషతో పాటు, మన అవసరాలను, మన నమ్మకాలను, మనకు విశ్వాసాన్ని కలిగించే పనులను చేశాకే - వాళ్ళకి అవసరమయిన పనులు చేయించుకున్నారు. ఏదీ? పొరుగువాడికి అర్థం కావాలన్న ఆసక్తి తమిళనాడులో ఒక్కచోట వెదకండి. ఒక్క ఆఫీసు బోర్డు తమరు అర్థం చేసుకోలేరు. అదీ మనకీ తెల్ల దొరల ఆలోచనా సరళికీ తేడా.

వృత్తి పనులో, మరే పనులో చేసుకునే వ్యక్తుల్ని ఇంగ్లీషు చదువుల్లోకి దింపి - వాళ్ళకి అవసరమయిన గుమాస్తాలుగా మార్చారు. ఆ రోజుల్లో స్వంత వృత్తి వదిలి ఇంగ్లీషు చదువు చదువుకోవడం గ్లామరు - గ్రామాలు వదిలి "మా వాడు పట్నంలో ఉంటున్నాడు (అడుక్కు తింటున్నా) అని చెప్పుకోవడంలాగ. లాభం రిటైరయాక చచ్చేదాకా ఫించని ఇచ్చే సదవకాశం. మా అమ్మకి నేను మద్రాసులో రచయిత కన్నా విశాఖపట్నంలో గుమస్తా కాలేదని బాధపడేది. కారణం? గుమస్తాకి ఫించను వస్తుంది. 55 సంవత్సరాలు నోరెత్తకుండా, తనకి అవసరం లేని, అక్కరలేని పనిని - మరొకరి సౌకర్యానికి చేసిపెట్టి - చచ్చేవరకూ భత్యాన్ని పొందే విధానం పట్ల ఇప్పటికీ మనకు గ్లామరు ఉన్నది.

మీ అబ్బాయి ఏం చదువుతున్నాడని కాక ఎందుకు చదువుతున్నాడని అడగండి. మొదట ఆ ప్రశ్నకే షాక్ అవుతారు. "ఇంకెందుకు? అమెరికాలో ఉద్యోగానికి" అని సమాధానం.

లేదా ఫలానా కంపెనీలో ఇంజనీరు కావడానికి.

"లాభం?"

"అయ్యో, బోలెడు జీతం"

చదువుకి ప్రయోజనం గొప్ప ఆదాయాన్నిచ్చే గొప్ప జీతమనే ఆలోచన తప్ప దాదాపు నూటికి నూరు శాతం ఈ తరం తల్లిదండ్రులు కానీ చదువుకునే విద్యార్థులు కానీ ఆలోచిస్తున్నట్టు కనిపించరు.

ఎక్కడో ఒక నారాయణ మూర్తి, ఒక ముఖేష్ అంబానీ, ఒక గోపీనాథ్, ఒక రామలింగరాజు కనిపిస్తారు. మిగతా అందరూ ఆయా కంపెనీలలో గుమస్తాలే అవుతారు.

దీనికి ఆలోచించే అవసరంకానీ, ఆలోచించవచ్చుననే పరిస్థితి కానీ ఇవాళ చాలా గొప్పగా చదువుకున్న 'మేధావి' అయిన కుర్రవాడికిరాదు.

ఏ అబ్దుల్ కలాం వంటి వారో రాష్ట్రపతి పదవి అయాక - నేను మళ్ళీ యూనివర్శిటీకి పోతాను - అంటారు. వారే ప్రస్తుత భారత దేశంలో భారత రత్నలవుతారు. మిగతావారు - చాలావరకు - కార్పొరేట్ కంపెనీల్లో ఖరీదయిన గుమస్తాలవుతారు.

మురళీ మనోహర్ జోషీ వంటి వారు పరాశరుడు, సుశ్రుతుడు, చరకుడు గురించి చెపితే - మళ్ళీ టైం మిషన్‌లో వెనక్కి వెళ్ళే పని చేస్తున్నారని నేడు గుమస్తా చదువులు చదివే చాలామంది మేధావి యువ క్లర్కులకి అనిపించవచ్చు.

పోనీ, ఇంగ్లీషు భాషలో చెప్పాలంటే ఒక గ్రాహం బెల్, ఒక థామస్ అల్వా ఎడిసన్, లేదా తెల్లవారి ఉద్యోగపు పనులలో వచ్చి - వృత్తికి మించి పెరిగి ఆలోచించ గలిగిన బ్రౌన్, మెకంజీ, కాటన్‌ల సాపత్యమో మనం తెచ్చుకునే అలవాటు ఎవరూ చెయ్యరు.

ఈ మధ్య ఎవరో కుర్రాడు హెలికాప్టర్ తయారు చేశాడట. ఫలితం ఏదయినా ప్రయత్నం గొప్పది.

జోషీగారు మొన్న 'సాంకేతిక పరిజ్ఞానపు భారతీయ వారసత్వం' అనే విషయంపై జాతీయ సదస్సుని ప్రారంభిస్తూ భారతదేశం ప్రపంచానికి క్లర్కుల దేశమని చెప్పారు. ఆయన ఆ మధ్య బ్రెజిల్ వెళ్ళారట. అక్కడి నుంచీ ఎద్దుల్ని మన దేశం తెచ్చుకోవాలని భారత దేశం ప్రయత్నిస్తోందట. ఈ ఎద్దు వారసత్వాన్ని గురించి వాకబు చేస్తే - 'అయ్యా, దీని బీజం ఇండియా నుంచే వచ్చింద'ని వారు పేర్కొన్నారట.

మన ఎద్దు మళ్ళీ మనదాకా వస్తోంది, సంతోషం. మరి మన "ఆలోచనా సరళి" ఈ ఎద్దుపాటి చెయ్యకూడదా?!